మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి



గుండ్లాపల్లిలో పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అరుణ, పార్టీ మండల కన్వీనర్ అప్పారావు, నాయకులు



మంచికలపాడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



రుద్రవరంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ



ఆలూరులో రూ.22.71 కోట్లతో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ మాధవి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని, అందుకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జగన్ మరోమారు ముఖ్యమంత్రి అయితేనే పేదలకు అండగా ఉంటుందన్నారు. మేలు చేశానని నమ్మితేనే నాకు ఓటు వేయండన్న దమ్మున్న ముఖ్యమంత్రి జగనన్న అని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నమ్మి పూర్తిగా అభివృద్ధి పథంలో నడుపుతున్నారని అన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి దేశానికే దిశానిర్దేశం చేస్తున్న జగనన్ననే మనం మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. గుండ్లాపల్లి గ్రామానికి డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.15,35,51,550 వచ్చాయని, గ్రామ అభివృద్ధి పనులకు రూ.18,09,81,550 వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, నాయకులు తేళ్ల పుల్లారావు, బొమ్మల రామాంజనేయులు, పైనం ప్రభాకర్ మల్లీశ్వరి, గ్రామ సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, ఎంపీటీసీ పల్లకి పద్మకుమారి, ఏఓ సుబ్బారావు, కారంపూడి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పలువురు లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచికలపాడులో...

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మంచికలపాడు సచివాలయం పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. టీడీపీ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని లబ్ధిదారులకు వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల బుక్‌లెట్లు, పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పీ నాగేశ్వరరావు, ఎంపీటీసీ అత్యాల అంకయ్య, సొసైటీ ప్రెసిడెంట్ గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, జడ రాజు, స్థానికులు పాల్గొన్నారు.

రుద్రవరంలో...

సంతనూతలపాడు మండలం రుద్రవరం గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లు, పార్టీ జెండా ఆవిష్కరించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సర్పంచ్ ఓ బలరామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మన భవిష్యత్తు...

ఆలూరు (కొత్తపట్నం): ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సువర్ణపాలన, అవినీతి లేని పాలన అందిస్తున్నారని ఆలూరు సర్పంచ్ పూనూరి మాధవి అన్నారు. ఆలూరు గ్రామ సచివాలయంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షతన నోడల్ అధికారి ఏ బాలచెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా రూ.22.71 కోట్ల సంక్షేమ పథకాల బోర్డును మాధవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం పార్టీలకు అతీతంగా అమలవుతోందన్నారు. ఈ నాలుగున్నర సంవత్సరాలలో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి పథకాలకు భారీగా నిధులు కేటాయించి అమలు చేసినట్లు చెప్పారు. ఆలూరు గ్రామానికి నాలుగున్నర సంవత్సరాలలో రూ.22.71 కోట్ల నగదును 38 రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శైలేష్, జాలిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’పై నేడు వర్క్‌షాప్



వర్క్‌షాప్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: ప్రభుత్వం ఆధ్వర్యంలో సంతనూతలపాడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై ఒంగోలులోని విష్ణుప్రియ ఫంక్షన్ హాలులో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు యర్రా దశరథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసుతం జరుగుతున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఇంకా విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు అవగాహన కల్పించేందుకు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కన్వీనర్లు, సర్పంచ్‌లు హాజరుకావాలని దశరథ్ కోరారు. వర్క్‌షాప్ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే టీజేఆర్ పరిశీలించారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న పీడీ, అధికారులు

నాగులుప్పలపాడు: ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి ఉపాధి పని చూపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు హౌసింగ్ పీడీ పేరయ్య పేర్కొన్నారు. 2024–25 ఏడాదికిగానూ ఉపాధి పనుల గుర్తింపునకు గురువారం ఉప్పుగుండూరు, ఒమ్మెవరం గ్రామాల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయమణి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పని చూపించేలా చర్యలు తీసుకోవడానికి గ్రామ సభ ద్వారా సమ్వనయంతో పనులు గుర్తించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏపీవో రవి, గ్రామ సర్పంచ్ దేవర కొండ జయమ్మ, ఈసీ విజయలక్ష్మి, మాదాసు రాంబాబు, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, కొలకలూరి విజయ్‌కుమార్, గండు వెంకట్రావు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

నజీర్ అహ్మద్ ఒక చీటర్

- కాలేషావలితో కలిసి ఆస్తుల విషయంలో మోసం చేశాడు
- అందులో వైఎస్సార్ సీపీకి, నితిన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదు
- నజీర్ వద్ద సుబ్బారావు గుప్తా రూ.7 లక్షలు తీసుకుని మాపై నిందలు వేస్తున్నాడు
- విలేకరుల సమావేశంలో బుడే సాహెబ్ కుమారులు షేక్ గౌస్‌బాషా, ఖాదర్ బాషా, కరిముల్లా, ఇతర సోదరులు



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌బాషా, ఖాదర్‌బాషా, కరిముల్లా, ఇతర సోదరులు

ఒంగోలు సబర్బన్: స్థానిక కొప్పోలు రోడ్డులోని భూముల విషయంలో షేక్ కాలేషావలి, ఆయన సోదరుడు షేక్ నజీర్ అహ్మద్‌లు మోసం చేశారని, నజీర్ అహ్మద్ ఒక చీటర్ అని ఇస్లాంపేటకు చెందిన బుడే సాహెబ్ కుమారులు ధ్వజమెత్తారు. స్థానిక ఎంసీఏ భవన్‌లో గురువారం బుడే సాహెబ్ కుమారులు షేక్ గౌస్‌బాషా, ఖాదర్‌బాషా, కరీముల్లా, రహంతుల్లా, ఫైజుల్లాలు విలేకరుల సమావేశం నిర్వహించి నజీర్ చేసిన మోసాలను వెల్లడించారు. బుడే సాహెబ్ పెద్ద కుమారుడు గౌస్‌బాషాకు బావమరుదులు అయిన షేక్ కాలేషావలి, నజీర్‌లు కలిసి భూములు కొనుగోలు చేసుకుని వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తుంటామన్నారు. అయితే షేక్ నజీర్ అహ్మద్ పేరుమీద కొప్పోలు గ్రామ సర్వే నంబర్ 613/1లో 3.18 ఎకరాలు ఉమ్మడిగా కొనుగోలు చేసి బావ మరిది అయిన షేక్ కాలేషావలి పేరుతో రిజిస్టర్ చేశామన్నారు. అందులో భాగంగానే తమ పేరుమీద వారిచేత ఒప్పంద పత్రం రాయించుకుని తమ వద్ద పెట్టుకున్నామన్నారు. అయితే కాలేషావలి తమ్ముడు నజీర్ అహ్మద్ ఒక 420 లాగా వ్యవహరించి తమను మోసం చేయాలని చూశాడన్నారు. తమ మధ్య మరికొన్ని ఆర్థిక లావాదేవీలు కూడా ఉన్నాయన్నారు. వీటన్నింటిపై నజీర్ అహ్మద్ కుట్రలు ఒక్కొక్కటిగా బయట పడటంతో న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించామన్నారు. ఇదిలా ఉంటే.. వైశ్య నాయకుడు సుబ్బారావు గుప్తా.. షేక్ నజీర్ అహ్మద్, అతని అన్న కాలేషావలి వద్ద రూ.7 లక్షలు తీసుకుని బుడే సాహెబ్ కుమారులపై మోసాలని, భూ కబ్జాలని అంటగడుతున్నాడని మండిపడ్డారు. 420 నజీర్ అహ్మద్‌తో చేతులు కలిపి తమ గురించి అన్యాయంగా మాట్లాడితే ఊరుకునేది లేదని సుబ్బారావు గుప్తాను హెచ్చరించారు. తమ భూములు, ఆర్థిక లావాదేవీల విషయంలో నజీర్ అహ్మద్ మోసం చేస్తున్నాడని ఈ ఏడాది అక్టోబర్ 5వ తేదీ ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు. 705/2023 నంబరుతో కేసు కూడా నమోదైందన్నారు. అయితే తమ లావాదేవీల వ్యవహారంలో వైఎస్సార్ సీపీకిగానీ, ఆ పార్టీలో ఉన్న నితిన్‌రెడ్డికిగానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. కావాలని దీనికి రాజకీయ రంగు పులిమి అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. భూ కబ్జాలు, నకిలీ డాక్యుమెంట్లు వ్యవహారానికి, తమ ఆర్థిక లావాదేవీలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నజీర్ అహ్మద్ మోసపూరిత వ్యవహారంలోకి సుబ్బారావు గుప్తాలాంటి వారు ప్రవేశించి పబ్బం గడుపుకుంటున్నారని కొట్టి పారేశారు.

డిసెంబరులో ఆడుదాం ఆంధ్రా

అద్దంకి: అవగాహనతో ఆడుదాం ఆంధ్రాకు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ లెక్కనబోయిన ఎస్తేరమ్మ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డిసెంబరులో సచివాలయాల వారీగా ఆటల పోటీల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే అడ్మిన్ కార్యదర్శులకు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అడ్మిన్, కార్యదర్శులకు ఆటల పోటీలు, కోర్టుల నిర్వహణపై పీడీలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌లు దేశు పద్మేశ్, కే అనంత లక్ష్మి, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

19న జాతీయ మహిళా దినోత్సవం

ఒంగోలు మెట్రో: గ్రంథాలయ వారోత్సవాలు, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకు ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక కోర్టు సెంటర్లోని కేంద్ర గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు నరసం గౌరవాధ్యక్షురాలు అరుణ తెలిపారు. మహిళాభ్యుదయ సమితి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ మహిళా న్యాయవాది, సమాజ సేవకురాలు ఎస్.దేవకుమారి, ప్రముఖ గాయని, నరసం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మున్నంగి రాజకుమారిలను విశిష్ట మహిళలుగా సన్మానించనున్నట్లు చెప్పారు. సాహిత్యాభిమానులు, పుర ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



వారోత్సవాల్లో మాట్లాడుతున్న చలపతిరావు

నాగులుప్పలపాడు: గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చలపతిరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో గురువారం పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథపాలకులు ప్రసాద్, సచివాలయ సిబ్బంది విజయలక్ష్మి, బాలు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్



వార్డు సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలోని 37వ డివిజన్‌లో గాంధీనగర్ వార్డు సచివాలయాన్ని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందితో మాట్లాడారు. అటెండెన్స్ రిజిస్టర్, మూమ్‌మెంట్ రిజిస్టర్‌తో పాటు నగరంలో జరుగుతున్న సర్వేలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా శానిటేషన్ పనుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శానిటరీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు.

నానిరెడ్డి పేరారెడ్డికి బాలినేని నివాళులు



పేరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

అల్లూరు (కొత్తపట్నం): వైఎస్సార్ సీపీ అల్లూరు గ్రామ అధ్యక్షుడు నానిరెడ్డి పేరారెడ్డికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ఘనంగా నివాళులర్పించారు. అల్లూరు గ్రామంలోని రాజీవ్ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన సంతాప సభకు బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరై పేరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పేరారెడ్డి 1995 నుంచి తనకు సుపరిచితుడని తెలిపారు. గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందడం బాధాకరమన్నారు. అతని మృతి అల్లూరు గ్రామానికి తీరని లోటని అన్నారు. వైఎస్సార్ సీపీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం వారి నివాసానికి వెళ్లి పేరారెడ్డి భార్య హేమలత, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాను అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. బాలినేని వెంట రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉప సర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ స్వర్ణ శివారెడ్డి, ఆళ్ల రామలింగారెడ్డి, కోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకారెడ్డి, శెట్టి రామకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెంలో చెరువు ఆధునికీకరణ



వలేటివారిపాలెం చెరువులో జమ్మును జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఒంగోలు రూరల్: మండలంలోని వలేటివారిపాలెంలో చెరువు ఆధునికీకరణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. చెరువులోని జమ్మును జేసీబీతో తొలగించారు. ఒంగోలు–గుండాయపాలెం రోడ్డు పక్కనే ఉన్న చెరువు కట్టల పటిష్టతకు చిల్లచెట్ల తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నుంచి వస్తున్న మల్లవరం కాలువ నుంచి చెరువుకు నీటిని పంపింగ్ చేసేందుకు కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. పూర్తిస్థాయిలో చెరువును నింపేందుకు చర్యలు చేపట్టినట్లు గ్రామ కార్యదర్శి రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత నలమోతు రాఘవరావు తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం చెరువు చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి కాపలాదారుడిని నియమిస్తామని సర్పంచ్ నలమోతు ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులతో పాటు గ్రామంలోని దాతలు ఆర్థికసాయం చేశారని చెప్పారు.

జైళ్లను సైతం లెక్కచేయని శంకరయ్య



శంకరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: జైళ్లను సైతం లెక్కచేయకుండా ప్రజల పక్షాన నిలబడి కలబడిన అసలుసిసలు ప్రజానాయకుడు శంకరయ్య అని సీపీఎం సీనియర్ నాయకుడు వై.సిద్ధయ్య అన్నారు. గురువారం స్థానిక సుందర్య భవన్‌లో తమళినాడుకు చెందిన సీనియర్ నాయకుడు శంకరయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించిన పలువురు నాయకులు శంకరయ్య ప్రజా జీవితాన్ని, ఆయన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. తమిళనాడులో కార్మిక, కర్షక ఉద్యమాలను నిర్మించడంలో శంకరయ్య కీలకపాత్ర పోషించారన్నారు. అనేక పోరాటాలలో పాల్గొన్న ఆయన.. 8 ఏళ్లపాటు జైలు జీవితం అనుభవించారని, మూడు సార్లు శాసన సభకు ఎన్నికయ్యారని జాలా అంజయ్య చెప్పారు. తొలుత శంకరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జీ రమేష్, కె.రమాదేవి, పి.కల్పన, బాబు, వినోద్, బాలకోటయ్య, ప్రసాద్, తంబి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిరప సాగుపై రైతులకు అవగాహన



మిరప తోటను పరిశీలిస్తున్న హార్టీకల్చర్ ఆఫీసర్ సంధ్య

చీమకుర్తి: మిరప సాగులో మెళకువలపై హార్టీకల్చర్ ఆఫీసర్ డీ సంధ్య గురువారం చంద్రపాడులో రైతులకు అవగాహన కల్పించారు. మిరప సాగు విస్తీర్ణం గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పెరిగిందన్నారు. మిరప పంటకు తరచూ వచ్చే తెగుళ్ల నివారణకు ఉపయోగించాల్సిన క్రిమిసంహారక మందులు వాడాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ వాకారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే టీజేఆర్



వలంటీర్ కిషోర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్

మద్దిపాడు: మండలంలోని బూరేపల్లి పునరావాసకాలనీలో వలంటీర్‌గా పనిచేస్తున్న కిషోర్ తల్లి ఇటీవల మృతి చెందారు. ఆ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు గురువారం ఉదయం బూరేపల్లి కాలనీకి వెళ్లి వలంటీర్‌ను పరామర్శించారు. వారి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, నాయకులు తేళ్ల పుల్లారావు, గ్రామ నాయకులు వెంకటాద్రి, రాజు తదితరులు ఉన్నారు.

ఇద్దరికి ట్రై సైకిళ్లు అందజేత

ఒంగోలు అర్బన్: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు శ్రీలత కోరాడ ఆర్థిక సహకారంతో ఇద్దరు దివ్యాంగులు జె.సుబ్బారావు, ఆళ్ల హరిబాబుకు ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాషా గురువారం మూడు చక్రాల సైకిళ్ల (ట్రై సైకిళ్ల) అందజేశారు. బలరాం కాలనీకి చెందిన సుబ్బారావుకు రెండు కాళ్లు చచ్చుబడి నడవలేని పరిస్థితిలో ఉండటం, దైవాలరావూరుకు చెందిన ఆళ్ల హరిబాబు చెయ్యి, కాలు పక్షవాతంతో పడిపోవడంతో వారిద్దరికీ ట్రై సైకిళ్ల అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ఐద్వా నాయకులు సీతామహాలక్ష్మి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాలపై పీఎం ఫొటో ఏర్పాటు చేయాలి

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ పంపిణీ వాహనాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఏర్పాటు చేయాలని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పువ్వాడి దామోదర్ కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రేషన్ పంపిణీకి కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తున్న నేపథ్యంలో మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు



ర్యాలీ నిర్వహిస్తున్న డీబీఆర్‌సీ ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: బాలల హక్కులు, చట్టాలపై డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో పోతురాజుపాలెం సచివాలయ పరిధిలోని బాలాజీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ యూపీ స్కూల్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఒంగోలు సిటీ డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్ గుత్తి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం, జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలల హక్కులు, కార్మిక నిషేధ చట్టం, బాలల అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు జ్యోతిష్యునికి జాతీయ పురస్కారం

ఒంగోలు మెట్రో: నగరానికి చెందిన ప్రసన్నకుమార్ జ్యోతిష్య రంగంలో అందించిన సేవలకు తెలుగు వెలుగు జ్యోతిష్యరత్న జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ రాజ్‌కుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ సభ డిసెంబర్ 10వ తేదీ విజయవాడలోని బాలోత్సవ్ భవన్లో జరుగుతుందని, ఆ సభలో పురస్కారం అందజేస్తామని చెప్పారు.

త్రోవగుంట హైస్కూల్లో చోరీ



క్లోజింగ్ సిమెంటు ప్లేట్ల చోరీతో ఓపెన్‌గా ఉన్న నిర్మాణాలు

ఒంగోలు రూరల్: త్రోవగుంట హైస్కూల్లో మరుగుదొడ్ల సిమెంటు, క్లోజింగ్ సిమెంటు ప్లేట్లు చోరీకి గురైనట్లు హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య తెలిపారు. నాడు–నేడు రెండో దశ పనుల్లో భాగంగా నూతన మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందన్నారు. ఈ మరుగుదొడ్ల నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన టాయిలెట్ రన్నింగ్ పాయింట్, క్లోజింగ్ సిమెంటు ప్లేట్లు చోరీకి గురైనట్లు గుర్తించి ఉన్నతాధికారులకు తెలిపినట్లు వెల్లడించారు.